# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MAY - 2005

## క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

TEJA TV




MAA TV

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు

**మా టి.వి.**లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు

**తేజ ఛానల్** లోను చూడండి.

ప్రతి గురువారం : **SITI కేబుల్ & IN కేబుల్‌లో**

(కాకినాడలో మాత్రమే) ఉదయం 7:00 గంటలకు,

సాయంత్రం 5:30 గంటలకు

ప్రసంగీకులు : Bro. **జాషువా గూటం**

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు వినిపించండి !!!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
Joshua Gootam

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | మే 2005 | సంచిక 10


## పరలోక రాజ్య స్థాపనము

(Establishment of the Kingdom of Heaven)

బైబిలులోని పాత నిబంధనను మనము చదివిన యెడల పరలోక మందున్న దేవుడు స్థాపించబోవు రాజ్యమును గూర్చిన ప్రవచనము లనేకములు కన్పించును. క్రొత్త నిబంధనలో అపొ.కా. 2వ అధ్యాయము తరువాత ఆ రాజ్యము స్థాపించబడి యున్నట్లు మనము చూడగలము. పరలోక రాజ్యము స్థాపించబడి ఇప్పుడు ఉన్నట్లు క్రొత్త నిబంధన బోధించుచుండగా అనేకులు అది ఇంకను స్థాపించబడలేదు, సరిగదా క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు అది స్థాపించబడునని బోధించుచుందురు. బైబిలును, చరిత్రను ఆధారము చేసికొని దేవుడు వాగ్దానము చేసిన పరలోక రాజ్యము స్థాపించబడినదో లేదో ఈరోజు తెలిసికొందము. దానియేలు గ్రంథము రెండవ అధ్యాయము ఇప్పుడు కొంత పరిశీలించుదము.

క్రీస్తుకు పూర్వము 600 సం॥ల క్రితం బబులోను సామ్రాజ్యమును ఏలుచున్న నెబుకద్నెజరు అను రాజు ఒకడుండెను (దానియేలు 1:1). ఆ కాలమందు బబులోను సామ్రాజ్యము భూదిగంతముల వరకు వ్యాపించి యుండెను. అందువలన భూమి మీదనున్న సమస్త జనాంగములు నెబుకద్నెజరు ఏలుబడిలో యుండెను. గనుక నెబుకద్నెజరు రాజులకు రాజాయెను. నెబుకద్నెజరు తన యేలుబడియందు రెండవ సంవత్సరమున కలలు కనెను (2:1). రాజు తాను కనిన కలలను తనకు తెలియజెప్పుటకై శకునగాండ్రను, గారడీ విద్య గలవారిని, మాంత్రికులను, కల్దీయులను పిలిపించెను. వారు వచ్చి భూమి మీద ఏ మనుష్యుడును రాజు అడిగిన సంగతి చెప్పజాలడు, రాజు విచారించిన సంగతి బహు అసాధారణమైనది. దేవతలు తప్ప మరెవరు ఈ సంగతి తెలియజెప్పజాలరు అని జవాబిచ్చిరి. అందుకు రాజు కోపము తెచ్చుకొని అత్యాగ్రహము గలవాడై బబులోను లోని జ్ఞానుల నందరినీ సంహరింపవలెని ఆజ్ఞ ఇచ్చెను.

అయితే ఇశ్రాయేలీయుడైన దానియేలు సకల విధములగు దర్శనములను, స్వప్నభావములను గ్రహించి తెలివిగలవాడై యుండెను (1:17). అప్పుడు దానియేలు రాజు సన్నిధికి పోయి స్వప్న భావము తెలియజెప్పుటకై తనకు సమయము దయచేయుమని రాజును బతిమాలు కొనెను. అంతట రాత్రియందు దర్శనము చేత ఆ మర్మమును దేవుడు దానియేలుకు బయలుపరచెను. కనుక దానియేలు పరలోక మందున్న దేవుని స్తుతించెను. దానియేలు రాజునొద్దకు తేబడగా రాజు కనిన కలను, దాని భావమును అతడు రాజునకు తెలియ జెప్పెను. అతడిట్లనెను :

"రాజా, తాము చూచుచుండగా బ్రహ్మాండమైన ఒక ప్రతిమ కనబడెను గదా......ఆ ప్రతిమ యొక్క శిరస్సు మేలిమి బంగారు మయమైనదియు, దాని రొమ్మును భుజములును వెండివియు, దాని ఉదరమును తొడలును ఇత్తడివియు, దాని మోకాళ్ళు ఇనుపవియు, దాని పాదములలో ఒక భాగము మట్టిదియునై యుండెను. మరియు చేతి సహాయము లేక తీయబడిన ఒకరాయి, యినుమును, మట్టియు కలిసిన ఆ ప్రతిమ యొక్క పాదముల మీద పడి దాని పాదములను తుత్తునియలుగా విరుగగొట్టెను. అంతట ఇనుమును, మట్టియు, ఇత్తడియు, వెండియు,

బంగారమును ఏకముగా దంచబడి కళ్ళము లోని చెత్తవలె కాగా వాటికి స్థలము ఎచ్చటను దొరకకుండ గాలి వాటిని కొట్టుకొని పోయెను; ప్రతిమను విరుగగొట్టిన ఆరాయి సర్వభూతలమంత మహాపర్వతమాయెను. తాము కనిన కల యిదే" (2:31-36).

నెబుకద్నెజరు కనిన కలను చెప్పిన తరువాత దాని భావమును దానియేలు రాజు సముఖమున తెలియజెప్పుటకు మొదలిడెను. ఆ కల ప్రకారము నాలుగు గొప్ప భూసామ్రాజ్యములు ఒకదాని తరువాత ఒకటి రాబోవుచున్నవని అతడు చెప్పెను. మొదటి భూసామ్రాజ్యము నెబుకద్నెజరు పరిపాలించుచున్న బబులోను సామ్రాజ్యము. తమరు రాజులకు రాజై యున్నారు. పరలోకమందున్న దేవుడు రాజ్యమును, అధికారమును, బలమును, ఘనతయు అనుగ్రహించియున్నాడు. తామే ఆ బంగారపు శిరస్సు. తాము చనిపోయిన తరువాత తమరి రాజ్యము కంటె తక్కువైన రాజ్యమొకటి లేచును. రాజు చూచిన ప్రతిమ యొక్క రొమ్ము, భుజములు వెండివి యగుట దీనిని సూచించును. అటు తరువాత లోకమంత యేలునట్టి మూడవరాజ్యమొకటి లేచును. అది యిత్తడివంటి దగును. పిమ్మట నాలుగవ రాజ్యమొకటి లేచును. అది ఇనుమువలె బలముగా ఉండును గాని ఒక విషయములో మట్టివలె బలహీనముగా నుండును. ఆ రాజ్యములో భేదము లుండును. అయితే ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు. అది ముందు చెప్పిన రాజ్యముల నన్నిటిని పగుల గొట్టి నిర్మూలము చేయును గాని అది యుగ యుగముల వరకు నిలుచును అని దానియేలు చెప్పెను.

నెబుకద్నెజరు కనిన కల దానియేలు చెప్పిన రీతిగానే అక్షరాలా నెరవేరెను అని ప్రపంచ చరిత్రను బట్టి మనము గ్రహించగలము. బబులోను సామ్రాజ్యము క్రీ॥పూ॥ 606 నుండి 536 వరకు ఏలుబడిలో నుండెను. అది బహు శక్తివంతమైనదై యుండెను. అటు తరువాత దానికంటె తక్కువైన మాదీయ - పారశీక సామ్రాజ్యము వచ్చెను. అది క్రీ॥పూ॥ 536 నుండి 332 వరకు ఏలుబడిలో యుండెను. దానికంటె బలములో తక్కువైన మూడవ భూసామ్రాజ్యము అనగా గ్రీకు సామ్రాజ్యము వచ్చెను. అందు అలెగ్జాండరు చక్రవర్తి గొప్ప ప్రఖ్యాతి గాంచినవాడాయెను. అది క్రీ॥పూ॥ 331 నుండి 146 వరకు

ఏలుబడిలో యుండెను. అటు తరువాత నాలుగవ భూ సామ్రాజ్యము రోమా సామ్రాజ్యము వచ్చెను. అది క్రీ॥పూ॥ 146వ సంవత్సరములో ఆరంభమై ఇంచుమించు 500 సంవత్సరములు ఏలుబడి చేసెను. అయితే కొంతకాలమునకు అది విభజింపబడి బలహీనమైనదై క్రీ॥శ॥ 395లో అంతమొందెను.

ఆ రాజుల కాలములో, అనగా 4వ భూసామ్రాజ్యమైన రోమా సామ్రాజ్యము పలుకబడిలో యున్న కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును స్థాపించును. దానికెన్నటికినీ నాశనము కలుగదు అని దానియేలు కలయొక్క భావమును చెప్పెను. గనుక దేవుని రాజ్యము లేక పరలోక రాజ్యము క్రీ॥పూ॥ 146 సం॥ము నుండి క్రీ॥శ॥ 395 సం॥ వరకు ఉన్న కాలములో ఎప్పుడో స్థాపించబడవలసి యుండెను.

అయితే రోమా సామ్రాజ్యపు కాలములోనే బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి పరలోక రాజ్యము సమీపించి యున్నది. మారుమనస్సు పొందుడని ప్రకటించుట మొదలిడెను (మత్తయి 3:2). అది క్రీ॥శ॥ 30 సం॥ము అయి యుండెను. గనుక అప్పటికింకను పరలోక రాజ్యము స్థాపించబడలేదు గాని, అది సమీపముగానే యున్నదని యోహాను బోధించెను. యేసుక్రీస్తు కూడ పరలోక రాజ్యము సమీపించి యున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు అదే సంవత్సరములో ప్రకటింప మొదలు పెట్టెను (మత్తయి 4:17). యేసు తన శిష్యులకు నేర్పిన మాదిరి ప్రార్థనలో పరలోకమందున్న మా తండ్రీ, నీ రాజ్యము వచ్చుగాక అని ప్రార్థించుమని నేర్పించెను (మత్తయి 6:10). యేసు ఆ ప్రార్థన నేర్పించుసరికింకను పరలోక రాజ్యము స్థాపించబడలేదని గ్రహించుకొన గలము గదా.

అంతేకాదు మత్తయి 16:28 లో ఆయన కొందరితో మాట్లాడుచు వారు చనిపోక ముందే దేవుని రాజ్యము వచ్చుట చూచెదరని యేసు చెప్పెను. మార్కు 9:1లో, దేవుని రాజ్యము బలముతో వచ్చునని, అది అక్కడ నిలచియున్నవారి జీవితకాలములోనే వచ్చునని, యేసు చెప్పెను. దేవుని రాజ్యపు రాకడ సూచనలను ఆయన ఇంకా ఇట్లు చెప్పెను: అది బలముతో లేక శక్తితో వచ్చును (మార్కు 9:1). ఆ శక్తి యెరూషలేములో వచ్చును (లూకా 24:49). పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు ఆ శక్తిని అపొస్తలులు పొందుదురు (అపొ.కా. 1:8).

అపొ.కా. 2వ అధ్యాయములో

ఇంతవరకు మనము చూచిన ప్రవచనము లన్నియు నెరవేరినట్లు చూడగలము. దానియేలు చెప్పిన స్వప్నభావము ప్రకారము పరలోక రాజ్యము రోమా సామ్రాజ్య కాలములో స్థాపింపబడవలెను. అపొ.కా. 2వ అధ్యాయములో జరిగిన సంగతులు ఆ రాజుల కాలములోనే జరిగెను. పెంతెకొస్తు అను పండుగ వచ్చినప్పుడు అపొస్తలుల మీద పరిశుద్ధాత్ముడు దిగెను. అది యెరూషలేములో జరిగెను. యేసు చెప్పిన రీతిగ అదివారి జీవితకాలములోనే జరిగెను. పరిశుద్ధాత్ముడు రాగా అపొస్తలులందరు శక్తిని పొందిరి. ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అను గ్రహించిన కొలది వారు అన్యభాషలతో మాటలాడసాగిరి.

దీనిని బట్టి 600 సంవత్సరముల క్రితమే దానియేలు ప్రవచించిన పరలోక రాజ్యము యెరూషలేములో, పెంతెకొస్తు అనుదినమున క్రీ॥శ॥ 33వ సంవత్సరములో స్థాపించబడినట్లు మనము గ్రహించుకొనగలము. ఆ దినము నుండి పరలోక రాజ్యము స్థాపించబడినట్లే వాక్యము నందు మనము కనుగొనగలము గాని అది స్థాపించబడబోవుచున్నట్లుగా లేదు. అందువలన కొలస్స 1:13లో "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేసెను" అని అపొ.పౌలు చెప్పుచున్నాడు. కొలస్సయులకు వ్రాసిన పత్రికను పౌలు క్రీ॥శ॥ 62-63వ సం॥లో వ్రాసెను. అప్పటికే దేవుని రాజ్యము స్థాపింపబడని యెడల వారు ఆ రాజ్య నివాసులు ఎట్లు కాగలరు?

ప్రకటన 1:9లో యోహాను దేవుని రాజ్యములో మీతో పాలివాడనైన నేను అని వ్రాయుచున్నాడు. ప్రకటన గ్రంధము నతడు వ్రాయుసరికి దేవుని రాజ్యము లేని యెడల అతడు దానియందు పాలివాడెట్ల వగలడు?

అపొ.కా. 2వ అధ్యాయమును బాగుగా చదివిన యెడల పరలోకమందున్న దేవుడు స్థాపించిన రాజ్యము, యేసుక్రీస్తు కట్టిన సంఘము – ఈ రెండూ ఒకటే యని మనము గ్రహించుకొనగలము. ఆ రాజ్యము లేక సంఘము ఎన్నటికినీ నాశనము కాదు. యేసుక్రీస్తు తన శరీరమైన సంఘమునకు శిరస్సు మాత్రమే కాదు (ఎఫెసీ 1:22-23), ఆయన రాజులకు రాజు కూడాను (ప్రకటన 19:16). ఆయన రాజైయుండగా, ఆయన సంఘసభ్యులు ఆయన రాజ్యమైయున్నారు. (హెబ్రీ 12:28). మరణమనునది సంపూర్తిగ నాశనమయ్యే వరకు ఆయన తన

రాజ్యమును పరిపాలించును. ఆయన రెండవ రాకడలో మరణము నాశనమగును. "అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యమును అప్పగించును. అప్పుడు అంతము వచ్చును" అని 1 కొరింథీ 15:24 చెప్పుచున్నది.

క్రీస్తు రాజ్యములో నీవు చేర్చబడ వలెననిన రాజులకు రాజైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, ఆయన ఆజ్ఞలకు లోబడుము. ఆయన ఆజ్ఞలకు విధేయత చూపించువారి నిత్యరక్షణకు కారకుడు ఆయనే సుమా (హెబ్రీ 5:9) !

- జాషువా గూటం

# దేవదూతల పని

## (The Work of the Angels)

దేవదూతను గూర్చి మనము ఏమైనా తెలిసికొన గోరిన యెడల, మానవుల యొద్దకు కాదుగాని దేవుని గ్రంథమైన బైబిలు నొద్దకు వెళ్ళవలెను. దైవదూతలు సృష్టి జరిగినప్పటికే యున్నను వారిని గూర్చి ఏమియు సృష్టి క్రమములో చెప్పబడలేదు. ఆదాము నుండి అబ్రహాము వరకు మనము బైబిలులో చదివిన యెడల అబ్రహాము దినములలో దేవదూతల గూర్చి చెప్పబడి నట్లు చూడగలము. పాతనిబంధనలో దేవ దూతలు దైవపుత్రులని మానవులు దేవుని సేవకులని చెప్పబడినది. క్రొత్త నిబంధనలో ఇది తారుమారు చేయబడినది. మానవులు దేవుని కుమారులని దూతలు ఆయన సేవకులని చెప్పబడినది.

రక్షణ పథకములో దేవదూతలకు ఒక పాత్రయున్నది. లూకా 15:10లో యేసు "అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నానను". ఐతియోపీయ నపుంసకుడు మార్పు చెందినప్పుడు అతనిని, అతనికి బోధించే సువార్తకుని ఒక దూత సమావేశ పరచెను. "ప్రభువు దూత నీవు లేచి దక్షిణముగా వెళ్ళి యెరూషలేము నుండి గాజాకు పోవు అరణ్య మార్గమును కలసి కొమ్మని ఫిలిప్పుతో చెప్పగా అతడు లేచి వెళ్ళెను" అని అపొ.కా. 8:26లో వ్రాయబడి యున్నది.

ఐతియొపీయుడైన నపుంసకుని అద్భుత రీతిగా మార్చుటకు దూత ప్రయత్నించ లేదని ఇక్కడ మనము గమనించవచ్చును. ఎందువలనంటే సర్వలోకమునకు సువార్తను బోధించుమని యేసుక్రీస్తు దేవదూతలకు కాదుగాని మంటిఘటములైన మానవులకే ఆజ్ఞ యిచ్చెను (మార్కు 16:15; 2 కొరింధి 4:7).

కొర్నేలి అనునతడు మార్పుజెందుటలో కూడ దేవదూత పనిచేసినట్లు మనము గమనించగలము. దేవుని దూత కొర్నేలి యొద్దకువచ్చి నీ ప్రార్ధనలు నీ ధర్మకార్యములు దేవుని సన్నిధికి జ్ఞాపకార్ధముగా చేరినవి. ఇప్పుడు నీవు యొప్పేకు మనుష్యలను పంపి పేతురు అను మారుపేరుగల సీమోనును పిలిపించుము; నీవును నీ యింటి వారందరును ఏ మాటలవలన రక్షణ పొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పుననెను అపొ.కా. 10:1-5; 11:14). సువార్తను బోధించు పేతురును సువార్తను వినబోవు కొర్నేలీతో కలుపుటయే దేవదూత ఇక్కడ చేసెను గాని కొర్నేలీకి అద్భుతరీతిగా సువార్తను బోధించి అతని మార్చుటకతడు ప్రయత్నించలేదు. ఏలయనగా సువార్త ప్రకటించు బాధ్యత మానవులదేగాని దేవదూతలది కాదని మరియొకసారి మనము గమనించగలము. అది అద్భుతములు జరిగే యుగమయిననుసరే దేవుడు మానవులను రక్షించు పధకములో ఒకడు సువార్తను విని విశ్వసించి లోబడవలెనని యున్నది. ఆ సువార్తను ప్రకటించే బాధ్యత ఆయన మానవులకిచ్చి యున్నాడు. గనుక దేవదూతలు దానిని ప్రకటించలేకపోయిరి. ప్రకటించబడిన సువార్తను నమ్ము ప్రతి వానిని అది రక్షించుటకు దేవుని శక్తియై యున్నది (రోమా 1:16).

ప్రకటన 14:6 లో యోహాను ఇట్లు వ్రాసెను : "అప్పుడు మరియొక దూతను చూచితిని. అతడు భూనివాసులకు అనగా ప్రతి జనమునకును ప్రతి వంశమునకును ఆయా భాషలు మాటలాడు వారికిని ప్రతి ప్రజలకును ప్రకటించునట్లు నిత్య సువార్త తీసికొని ఆకాశమధ్యమున ఎగురు చుండెను". సువార్త ప్రకటనలో ఇక్కడ ఒకదూత యున్నట్లు మనము చూచు చున్నాము. అయితే అతడు ఏవిధముగా సువార్తను ప్రకటించెను? ప్రకటన గ్రంధము మొదటి వచనములోనే "ఆయన తన దూత ద్వారా వర్తమానమును పంపి తనదాసుడైన యోహానుకు వాటిని సూచించెను" అని యోహాను చెప్పెను. యేసుక్రీస్తు చెప్పిన దానిని దూత యోహానుకు బయలు

పరచెను. యోహాను తనకు బయలు పరచబడిన దానిని ప్రకటించెను. నిజానికి బయలుపరచినది దూతయే అయినను ప్రకటించినవాడు యోహాను మాత్రమే. ఈ విధముగా సువార్త ప్రకటనలో దేవదూతలు మిళితమై యున్నారు.

దేవదూతలు దేవుని ఆరాధించుటలో నిమగ్నులై యుందురు. "ఆయన దూతలారా మీరందరు ఆయనను స్తుతించుడి. ఆయన సైన్యములారా ఆయనను స్తుతించుడి" యని కీర్తన 148:2లో వ్రాయబడి యున్నది. దేవుని దూతలు ఆయనను స్తుతించుటలో నిశ్చయముగా నిమగ్నులై యున్నారు. దేవుని సన్నిధిలోనున్న సెరాపులు, సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు పరిశుద్ధుడు, సర్వలోకము ఆయన మహిమతో నిండి యున్నది అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుచుండిరి" యని యెషయా 6:3లో వ్రాయబడి యున్నది. దేవుని దూతలు పరిశుద్ధుడైన దేవుని రాత్రింబగళ్ళు మానక కొనియాడుచు ఉన్నట్లు ప్రకటన 4:8లో వ్రాయబడి యున్నది.

మన ప్రార్ధనలలో కూడ దేవదూతలు ముఖ్యపాత్రను వహించుదురు అని మనము కొన్ని సందర్భాలనుబట్టి గ్రహించు కొనగలము. దానియేలు తన ప్రార్ధనానుభవమును మనకు ఇట్లు వర్ణించుచున్నాడు: "నేను ఈలాగున మాటలాడుచు ప్రార్ధన చేయుచుండగా మొదట నేను దర్శనమందు చూచిన అతి ప్రకాశమానుడైన గబ్రియేలను ఆ మనుష్యుడు సాయంత్రపు బలి అర్పించు సమయమున నాకు కనబడి నన్ను ముట్టెను. అతడు నాతో మాటలాడి ఆ సంగతి నాకు తెలియజేసి ఇట్లనెను: దానియేలూ నీకు గ్రహింపశక్తి నిచ్చుటకు నేను వచ్చితిని" (దానియేలు 9:21, 22). దానియేలు ప్రార్ధించుటకు ఆరంభించినప్పుడు అతని ప్రార్ధనలకు జవాబిచ్చుటకు దేవుడు గబ్రియేలను దూతను అతనియొద్దకు పంపించెను. కొర్నేలి దేవునికి ఎల్లప్పుడు ప్రార్ధన చేయుచుండెడివాడు. అతని ప్రార్ధనలకు జవాబిచ్చునట్లు దేవుడు గబ్రియేలను దూతను అతనియొద్దకు పంపించెను. కొర్నేలి దేవునికి ఎల్లప్పుడు ప్రార్ధన చేయుచుండెడివాడు. అతని ప్రార్ధనలకు జవాబిచ్చునట్లు దేవుడు దర్శనము ద్వారా దేవదూతను అతని యొద్దకు పంపించెను (అపొ.కా. 10:3). అతడు ప్రకాశమానమైన వస్త్రములు ధరించుకొని యుండెనని పేతురు కొరకు కబురు పంపమని చెప్పెనని

కొర్నేలి ఆదూతను గూర్చి చెప్పెను (అపొ.కా. 10:30,31). క్రీస్తు సంఘము స్థాపించబడిన కొద్ది దినములలోనే అపొ.పేతురు చెర సాలలో వేయబడెను. సంఘమయితే అతని కొరకు అత్యాసక్తితో దేవునికి ప్రార్థన చేయు చుండెను. ప్రభువు తన దూతను పంపి పేతురును అద్భుతరీతిగా చెరసాల నుండి విడుదల చేయించెను (అపొ.కా. 12:5-10).

యేసు క్రీస్తు జీవితములో దేవ దూతల పాత్రను ఇప్పుడు మనము కొంచెము తెలిసికొందము. క్రీస్తు జీవిత ములో దూతల పాత్రను ఎరిగినవాడై దావీదు ఇట్లు వ్రాసెను : "నీ మార్గము లన్నిటిలో నిన్ను కాపాడుటకు ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును. నీ పాదములకు రాయి తగలకుండ వారు నిన్ను తమ చేతుల మీద ఎత్తి పట్టు కొందురు" (కీర్తన 91:11, 12). క్రీస్తును శోధించుటకు అపవాది ఇదే వచనమును వినియోగించినట్లు మత్తయి 4వ అధ్యాయ ములో మనము చూడగలము.

క్రీస్తు యొక్క జననమును గూర్చి దేవ దూత యొకడు యోసేపుకు తెలియ జేసెను: "ఇదిగో ప్రభువుదూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది" యని చెప్పెను (మత్తయి 1:20). క్రీస్తు జననమును గూర్చి మరియకు కూడ దేవదూత తెలియజేసెను. గబ్రియేలను దేవదూత కన్యయైన మరియకు కనబడి మరియా భయపడకుము; దేవుని వలన నీవు కృప పొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు" అని చెప్పెను (లూకా 1:26-31). రక్షకుడైన క్రీస్తు పుట్టగానే ఆ వార్తను గొల్లలకు దేవదూత ప్రకటించెను; "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీకొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీకానవాలు; ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొకతొట్టెలో పండుకొని యుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను" (లూకా 2:11, 12). యేసు పుట్టిన తరువాత హేరోదు యొక్క ఆగ్రహము నుండి తప్పించుకొను నిమిత్తము ప్రభువు దూత యోసేపునకు ప్రత్యక్షమై నీవు లేచి శిశువును ఆయన తల్లిని వెంట బెట్టుకొని ఐగుప్తునకు పారి పోయి నేను నీతో తెలియ జెప్పువరకు అక్కడనే యుండుమని అతనితో చెప్పెను (మత్తయి 2:13).

యేసు అపవాదిచే శోధింపబడిన తరువాత "ఇదిగో దేవదూతలు వచ్చి ఆయనకు పరిచర్య చేసిరి" అని వ్రాయబడి యున్నది (మత్తయి 4:11).

యేసు ఈ లోకములో యుండి బోధించుచున్నప్పుడు ఆయన బోధలో పలుమారులు దూతలను గూర్చి చెప్పుచు యుండెను. "ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి; వీరి దూతలు పరలోకమందున్న నాతండ్రి ముఖ మును ఎల్లప్పుడు పరలోకమందు చూచు చుందురని" ఆయన చెప్పెను (మత్తయి 18:10). దీనినిబట్టి చిన్నబిడ్డలను కాపాడే దూతలు కొందరున్నారని కొందరు భావిం తురు. ఈ వాక్యమునుబట్టి మనము దానిని కాదనలేము. మరియు నేను మీతో చెప్పున దేమనగా నన్ను మనుష్యుల యెదుట ఒప్పు కొను వాడెవడో మనుష్య కుమారుడు దేవుని దూతల యెదుట వానిని ఒప్పు కొనును. మనుష్యుల యెదుట నన్ను ఎరుగనను వానిని నేనును ఎరుగనని దేవుని దూతల యెదుట చెప్పుదును అని యేసు పలికెను (లూకా 12:8, 9).

సిలువ నీడలో నిలుచుని ఒలీవ కొండపై యేసు ప్రార్థించుచుండగా అప్పుడు పరలోకమునుండి యొకదూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను (లూకా 22:43). సిలువను సహించుటకు యేసుకు శారీరక శక్తియేగాక ఆత్మీయ బలము అత్యవసర మాయెను. ఆయన వేదనపడి మరింత అతురతగా ప్రార్థన చేయగా ఆయన చెమట నేలమీద పడుచున్న గొప్ప రక్తబిందువులాయెను (లూకా 22:44). ఆయన నప్పగించుటకు యూదా ఇస్కరి యోతు తీసికొని వచ్చిన జనసమూహమును చూచి పేతురు తొందరపడి కత్తిదూసి ప్రధాన యాజకుని దాసునికొట్టి వానిచెవి తెగనరికెను గాని యేసు ఈ సమయమున నేను నాతండ్రిని వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనావ్యూహములకంటె ఎక్కువమంది దూతలను ఇప్పుడే నాకు పంపడని నీవనుకొనుచున్నావా? యనెను (మత్తయి 26:53).

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మరణమును జయించి సమాధి నుంచి పునరుత్థానుడైనప్పుడు ఇదిగో ప్రభువు దూత పరలోకము నుండి దిగివచ్చి రాయి పొర్లించి దానిమీద కూర్చుండెను; అప్పుడు మహాభూకంపము కలిగెను (మత్తయి 28:2). యేసు తాను చెప్పినట్టే లేచి యున్నాడు అని యేసు సమాధి దగ్గరకు వచ్చిన స్త్రీలకు దూత ప్రకటించెను. యేసు

పునరుత్థానుడైన తరువాత నలువది దినములు తన శిష్యుల కగుపడుచు వారికి దేవుని రాజ్యవిషయములను గూర్చి బోధించుచు వారికి అనేక రుజువులను చూపి చివరకు పరలోకమునకు ఆరోహణుడాయెను. ఆయన వెళ్ళుచుండగా వారు ఆకాశమువైపు తేరిచూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన యిద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి యీ యేసే ఏరీతిగా వెళ్ళెనో ఆరీతిగానే తిరిగివచ్చునని చెప్పిరి (అపొ.కా. 1:10,11).

యేసు మరల వచ్చునప్పుడు ఆయనతో కూడ సమస్త దూతలను వెంటబెట్టుకొని వచ్చునని మత్తయి 25:31లో వ్రాయబడి యున్నది. దేవదూతలు వచ్చి నీతిమంతులలో నుండి దుష్టులను వేరుపరచి వీరిని అగ్ని గుండములో పడవేయుదురు, అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 13:49, 50).

పరలోక పట్టణపు గుమ్మముల యొద్ద పన్నిద్దరు దేవతలున్నట్లు యోహాను వ్రాసెను (ప్రకటన 21:22). "గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడినవారే దీనిలో ప్రవేశింతురుగాని నిషిద్ధమైనదేదైనను అసహ్యమైన దానిని అబద్ధమైన దానిని జరిగించు వాడైనను దానిలో ప్రవేశింపడు" (ప్రకటన 21:27).

నీవు పరలోక పట్టణములో ప్రవేశించవలెనన్న ఈరోజే యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొందుము, యేసుప్రభువు నందలి విశ్వాసమును నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొంది ప్రభువు సంఘముతో చేర్చబడుము.

మీకు సమీపముగాయున్న క్రీస్తు సంఘమునకు ఈరోజే దర్శించండి.

✍ - జాషువా గూటం

❀ ❀ ❀

గమనిక : సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.
SATYA VANI, P.O. BOX-80, KAKINADA - 533 001.

# దెబోరా

## (Deborah A wise and Courageous Mother)

ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి దోషులైనపుడు కనాను రాజైన యాబీను చేతికి ఆయన వారి నప్పగించెను. ఇరువది సం॥రములు యాబీను రాజు కఠినముగ వారిని బాధపెట్టగా ఇశ్రాయేలీయులు యెహోవాకు మొరపెట్టిరి. ఈయాబీను రాజుకు తొమ్మిదివందల ఇనుప రధము లుండెను. ఈ కాలములో యెహోవా దేవుడు తన ప్రజలకు న్యాయాధిపతిగ డెబోరాను యేర్పాటు చేసికొనెను. ఈమె లప్పీదోతు భార్య. భార్యగ, తల్లిగ, ప్రవక్త్రిగ, న్యాయాధిపతిగ, కవయిత్రిగ, గాయకురాలిగ, నాయకురాలిగ చాల సమర్ధవంతముగ ఆ పాత్రలు నిర్వహించి మంచి ప్రసిద్ధి కెక్కను.

దెబోరా కాలము నాటి ఇశ్రాయేలీయులు స్థితి : 1) ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి యింకను దోషులైరి గనుక యెహోవా హాసోరులో ఏలు కనాను రాజైన యాబీను చేతికివారి నప్పగించెను (న్యాయా 4:1). న్యాయాధిపతుల గ్రంధము యొక్క మూలాంశము – ఇశ్రాయేలీయులు యొక్క నైతిక దుస్థితి. దెబోరాకు ముందు కాలములో వారు దేవునికి విరోధముగ రెండు తప్పిదములు చేసిరి. తరువాత మరి మూడు తప్పిదములు నమోదు చేయబడెను. ఇవి యెహోవాను విసర్జించుటతో ప్రారంభమైనవి. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు. ఆయన తనకు స్వాస్థ్యముగ యేర్పరచుకొను జనులు ధన్యులు (కీర్తనలు 33:12). ఈ నైతిక దుస్థితికి కారణము : వారు అన్యుల సహవాసమును విడువక యుండిరి. దుష్టా సాంగత్యము మంచి నడవడిని చెరుపును (1 కొరింథీ 15:33). దేవుని యొక్క ఈ ఆజ్ఞకు వారు లోబడక ఆయన మాటను నిరాకరించి ఆయన దృష్టిలో దోషులైరి. 2) ఎవరి స్వంత యిష్ట ప్రకారము వారు ప్రవర్తించుచు వచ్చిరి. అందువలన దేశములో నెమ్మది, సంతోషముండదు. ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజులేడు. ప్రతివాడును తన, తన యిష్టానుసారముగ ప్రవర్తించుచు వచ్చెను (న్యాయా 17:6, 21:25). ఈ రెండు పొరపాట్లను ఇశ్రాయేలీయులు చేసినందున అన్యుడైన కనాను రాజు చేతికి వీరిని అప్పగించెను. ఆ రాజు

ఇశ్రాయేలీయులను బహు కఠినమైన శ్రమలతో బాధించెను. అతడు ఇరువది సం॥రముల ఇశ్రాయేలీ యులను బాధ పెట్టగా ఇశ్రాయేలీయులు యెహోవాకు మొరపెట్టిరి (న్యాయా 4:3). దేవుడు వారి మొరను వినెను. దెబోరాను న్యాయాధిపతిగ వారికొరకు యేర్పాటు చేసెను (న్యాయా 4:4). నాయకురాలిగ, న్యాయాధిపతిగా ఎంచబడుటకు ఆమెలో గల కొన్ని విశిష్ట లక్షణములు :

ఏ దేవుడైతే పరలోక వాసియై ఫరో బలమును కూల్చి ఇశ్రాయేలు జనాంగ మును దాసత్వము నుండి విడిపించి అరణ్యములో మన్నాతో వారిని నలుబది యేండ్లు పోషించెనో, బలమైన యెరికో గోడలను కూల్చెనో, యెహోషువాతో "నిబ్బరము గలిగి ధైర్యముగ నుండుము" అని చెప్పెనో ఆ దేవుని యందు నమ్మిక యుంచి, ఆ దేవునినే ఆమె ఆశ్రయించింది. అందుచే ఆ దేవుని నుండియే ఆమె జ్ఞానమును, ధైర్యమును పొంది ఇరువది సం॥రములు వారిని బహునేర్పుగా నడిపించింది. రామాకును, బేతేలు కును మధ్యనున్న సరళవృక్షము క్రింద కూర్చుండి ఆమె దేవుని చిత్తమైన తీర్పును ప్రజలకు చెప్పుచూ యుండేది. యెహోవా దేవుడు తెలియజేసిన పద్ధతి ననుసరించి కార్యములు నిర్వర్తించుటకు ఆమె యేమాత్రమును సందేహింపక ధైర్యముతో ముందుకు సాగిపోయెడిది. ఆమె బారాకును పిలువనంపించి అతనితో యిట్లనెను: నీవు వెళ్ళి నఫ్తాలీయుల లోను, జెబులూనీయుల లోను పదివేల మంది మనుష్యులను తాబోరు కొండ యొద్దకు రప్పించుము; నీ దగ్గరకు యాబీను సేనాధిపతియైన సీసెరాను, అతని రథములను, అతని సైన్య మును కీషోను ఏటి యొద్దకు కూర్చి నీచేతికి అతనిని అప్పగించెదనని ఇశ్రాయేలీ యుల దేవుడైన యెహోవా సెలవిచ్చి యుండలేదా? అని దెబోరా చెప్పగా బారాకు – నీవునాతో వచ్చిన యెడల నేను వెళ్ళెదను, గాని నీవు నాతో కూడ రానియెడల నేను వెళ్ళనని ఆమెతో చెప్పెను (న్యాయా 4:6-8). బారాకుకు దెబోరా యొక్క విశ్వాసము, ధైర్యము కావలసియున్నది. అప్పుడు ఆమె నీతో కూడ నేను అగత్యముగ వచ్చెదను అని చెప్పి బారాకుతో కూడ వెళ్ళి ఇశ్రాయేలీ యులలో నుండి యేర్పరచబడిన పదివేల మంది సైనికులను నడిపించెను. దెబోరా యొక్క ధైర్యమును బట్టి బారాకును, పది వేల మంది సైనికులు కూడ ధైర్యపరచ బడిరి. కనానీయులు యొక్క బలమైన

సైన్యము, తొమ్మిది వందల రథములతో ఓడిపోయిరి. ఇశ్రాయేలీయులకు విజయము కలిగెను. దానిని గూర్చిన పాట న్యాయాధిపతులు 5వ అధ్యాయములో చదువగలము.

ఇశ్రాయేలీయులు జయమునకు కారణము ఆ దినమున దేవుడు ఇశ్రాయేలీయుల యెదుట కనాను రాజైన యాబీనును అణచెను (న్యాయా 4:23). దెబోరా, బారాకులు పాడిన జయగీతమును బట్టి దేవుని హస్తము వారికి తోడై నడిపించిన విధమును బట్టి దేవుని స్తుతించిన విధమును మనము గ్రహించగలము. దేవునికి తమ్మును తాము సమర్పించుకొనినపుడు వారి ద్వారా దేవుడు క్రియ జరిపించును (న్యాయా 5:2). దేవునితో కలసి పనిచేయుటకు అనగా దైవ చిత్తానుసారముగా పనిచేయుటకు ప్రజలు ఒప్పుకొనినపుడు దేవుడు వారికి జయమును అనుగ్రహించెను. దెబోరా అను నేను రాకమునుపు, ఇశ్రాయేలులో నేను తల్లిగా ఉండక మునుపు వారు లేకపోయిరి (న్యాయా 5:7). కలిగిన జయములో ఆమెకు పాత్ర యున్నదని దెబోరా గ్రహించింది. ఈ జయమును బట్టి ఆమె అతిశయించలేదు. గాని దేవుని స్తుతించి మహిమ పరచింది. ప్రజలలో కూడ త్యాగము కనుపరచిరి. జెబులూనీయులు మరణ భయము లేక ప్రాణము తృణీకరించుకొనిన జనము, నఫ్తాలీయులు భూమి మెట్టలమీద ప్రాణము తృణీకరించిరి (న్యాయా 5:18). దెబోరా, బారాకు, ఇశ్రాయేలీయుల ప్రజలందరు తమ్మును తాము మరల దేవునికి సమర్పించు కొని దేవుని యాజ్ఞల ప్రకారము నిర్వర్తించుటకు, ఆయన చిత్తానుసారముగ జీవించుటకు ఒప్పందము చేసికొనిరి.

దెబోరా యొక్క జీవితము ఒక జనాంగము నంతటి స్థితిని మార్చి విమోచనలోనికి నడిపించ గలిగింది. కారణం, ఆమెకు దేవుని యందు గల భక్తి విశ్వాసములు. ఇశ్రాయేలీయులు నలుబది సం॥రములు నెమ్మదిగ యుండిరి (న్యాయా 5:31). ఇశ్రాయేలీయుల సైనిక బలము బహు బలహీనమైనది. బలవంతుడైన దేవుని వారు ఆశ్రయించినపుడే వారికి విజయము కలిగెను.

మనకు మన జీవితములలో విజయము రావలెననిన మనము మెళకువ కలిగి జాగ్రత్తగ యుండి ఆయన కట్టడలను, విధులను ఆచరించాలి. దెబోరా మేలుకొనుము, మేలుకొనుము (న్యాయా 5:21). క్రైస్తవుడా, మేలుకొనుము. నిన్ను నాశనమునకు నడిపించు పాపము నుండి

తప్పించుకొనుము. పాపము నుండి రక్షింప సమర్థుడై దేవుని వైపుకు తిరుగుము. హృదయపూర్వక ముగ మనలను మనము దేవునికి సమర్పించుకొని ధైర్యముతో అపవాది తంత్రములను ఎదిరించవలెను. హృదయమును దేవుని వాక్యముతో నింపు కొనవలెను. దెబోరా వంటి విశ్వాసము, ధైర్యము గల తల్లులు, నాయకురాండ్రు, వ్యక్తుల ద్వారా దేవుడు తన కార్యములను జరిపించును, కొనసాగించును.

- లోటీ బెత్ హాట్స్

# సహస్రాబ్దిస్వామ్యం

(Millenniel Reign)

క్రీస్తు మొదటిసారి వచ్చినప్పుడు రాజ్యాన్ని స్థాపించాలనే సంకల్పముతోనే వచ్చారు గాని యూదులు ఆయన్ని తిరస్కరించుట వలన రాజ్యాన్ని (బేసలియాస్) స్థాపించలేక దానికి ప్రత్యామ్నాయముగా సంఘాన్ని (ఎక్లెసియా) స్థాపించారని, రెండవ రాకడలో యెరూషలేమును కేంద్రంగా చేసికొని తన రాజ్యాన్ని ఏర్పాటుచేసి వెయ్యేండ్లు పరిపాలిస్తారని కొన్ని క్రైస్తవ శాఖలు క్రీస్తు రాజ్యాన్ని గూర్చి భిన్నమైన బోధలు ప్రచారం చేస్తున్నాయి.

అయితే ఈ సహస్ర వార్షిక పాలన లేఖనాను సారమైనదా? రాజ్యాన్ని గూర్చి బైబిలు ఏమని బోధిస్తున్నది? తీర్పుకు ముందు క్రీస్తు భూమిపై వెయ్యి సంవత్సరాలు పాలన చేస్తారా? క్రీస్తు రాజ్యాన్ని గూర్చిన యిత్యాది ప్రశ్నలకు లేఖనాల్నుండి జవాబులను విశదంగా తెల్సికొందాం.

## రాజ్యాన్ని మొదట వెదకుడి

"మీరు ఆయన రాజ్యాన్ని నీతిని మొదట వెదకుడి; అప్పుడ వన్నియు మీకు అనుగ్రహించబడును" (మత్తయి 6:33). ఈ వాక్యాన్ని జాగ్రత్తగా పఠించినట్లయితే మనం రెండు విషయాల్ని గ్రహించగలం : మొదటిది – రాజ్యాన్ని వెదకుట; రెండవది – నీతిని వెదకుట. రాజ్యాన్ని వెదకాలంటే దాన్ని గూర్చిన దేవుని సంకల్పాన్ని, ఉనికిని మరియు స్వభావాన్ని తెలుసు కోవాలి.

## ఇశ్రాయేలీయులు - రాజ్యపాలన వ్యవస్థ

ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి కనాను చేరిన తర్వాత సుమారు 400 సం॥ల న్యాయాధిపతులచే పాలింపబడ్డారు. ప్రవక్తయు న్యాయాధి పతియైన సమూ యేలు కాలములో - "సకల జనులు మర్యాద చొప్పున మాకు రాజును నియమించుము" (1 సమూ 8:5) యని ఇశ్రాయేలీయులు అడిగినప్పుడు యెహోవా దానికి అంగీకరించి రాజరికము వలనైన కష్ట నష్టాలను వివరించి (1 సమూ 8:5-22) సౌలును రాజుగా నియమించారు. నిజానికి అట్టి ఏర్పాటును, వీలును దేవుడు తన శాసనాలలో ముందుగనే నిర్ణయించారు. "నా చుట్టునున్న సమస్త జనుల వలే నా మీద రాజును నియమించు కొందునను కొనిన యెడల దేవుడైన యెహోవా ఏర్పరచు వానిని అవశ్యముగా నీ మీద రాజుగా నియమించు కొనవలెను. నీ సోదరులలో ఒకని నీమీద రాజుగా నియమించు కొనవలెను. నీ సహోదరుడు కాని అన్యుని నీ మీద నియమించు కొనగూడదు". పిమ్మట రాజుకు తగని నాలుగు నిషేధములు, నెరవేర్చవలసిన నాలుగు విధులు ఇవ్వబడి నాయి (ద్వితీ 17:14-22).

సమూయేలు ప్రవక్త దేవుని చిత్త ప్రకారం బెన్యామీను గోత్రి కుడైన సౌలును రాజుగా అభిషేకించి (1 సమూ 9:16, 10:22-24), రాజ్యపాలన పద్ధతిని జనులకు వినిపించి ఒక గ్రంథాన్ని వ్రాసి యెహోవా సన్నిధిని దాని నుంచాడు (1 సమూ 10:25). ఇంచుమించు క్రీ॥పూ॥ 1095 సం॥ నుండి ఇశ్రాయేలీయులకు రాజరిక వ్యవస్థ యేర్పడింది. రాజైన సౌలు దేవునికి విరోధముగా పాపం చేయుట వలన రాజరికం యూదా గోత్రికుడైన దావీదుకు అనుగ్రహించబడింది. ఇశ్రాయేలీయులను సౌలు 40 సం॥లు, దావీదు 40 సం॥లు, సొలొమోను 40 సం॥లు పాలించిన పిమ్మట సొలొమోను కుమారుడైన రెహబాము పాలనలో ఇశ్రాయేలు దేశం (ఐక్యరాజ్యం) రెండు భాగములైంది. అప్పుడు యారోబాము రాజుగా షోమ్రోను కేంద్రముగా ఉత్తర ప్రాంతమైన ఇశ్రాయేలు రాజ్యపాలన ప్రారంభమై 19 మంది రాజులచే పాలింపబడి ప్రజల యొక్క రాజుల యొక్క పాపాల వలన క్రీ.పూ. 721 సం॥లో అష్షూరీయులచే చెరపట్టు బడింది. దక్షిణ ప్రాంతమైన యూదా రాజ్యం యెరూషలేము కేంద్రంగా 20 మంది రాజులచే పాలింపబడి, ఇశ్రాయేలు రాజ్యపు నాశనమును చూచియు వారివలెనే పాపము నుండి దేవుని వైపు మరల నందున క్రీ.పూ. 606 నుండి 586 వరకు బబులోను వారిచే చెరపట్టుబడింది

"మీరు (ఇశ్రాయేలీయులు) యొర్దాను దాటి స్వాధీన పరచు కొనబోవు దేశములో ఉండ కుండ త్వరలోనే బొత్తిగా నశించిపోదురు" (ద్వితీ 4:25, 26) యని దేవుడు వారిని ముందుగనే హెచ్చరించాడు. ద్వితీయోపదేశ కాండం 4,8 అధ్యాయములు చదివితే దీన్ని గూర్చి విపులంగా తెల్సికోవచ్చు. దేవుని విసర్జించి విగ్రహాలను పూజించుట వలన దేవుడు ఇశ్రాయేలీయులను వారి శత్రువు లకు అప్పగించి శిక్షించారు.

## మెస్సీయ కొరకు ఇశ్రాయేలు వారి నిరీక్షణ

"ఇశ్రాయేలు వారు యారోబాము చేసిన పాపములలో దేనిని మరువక వాటిని అనుసరించుచు వచ్చిరి గనుక తన సేవ కులైన ప్రవక్తల ద్వారా యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున ఆయన ఇశ్రాయేలు వారిని తన సముఖములో నుండి వెళ్ళగొట్టెను. ఆ హేతువు చేత వారు స్వదేశములో నుండి అష్షూరు దేశములోనికి చెరకొని పోబడిరి. అష్షూరు రాజు బబులోను కూతా, అవ్వా, హమాతు, సెపర్వయీము అను తమ దేశములలో నుండి జనులను రప్పించి ఇశ్రాయేలు వారికి మారుగా షోమ్రోను పట్టణములో ఉంచెను. వారు షోమ్రోను దేశమును స్వతంత్రించు కొని దాని పట్టణ ములో కాపురము చేసిరి. అయితే వారు కాపురముండ నారంభించినప్పుడు యెహోవా యందు భయభక్తులు లేని వారు గనుక యెహోవా వారి మధ్యకు సింహ ములను పంపెను. తమరు పట్టుకొనిన షోమ్రోను పట్టణములో తాముంచిన జను లకు ఆ దేశము మర్యాద తెలియ కున్నది గనుక ఆయన సింహములు వారిని చంపు చున్నవని వారు రాజులతో మనవి చేయగా, అష్షూరు రాజు అచ్చటి నుండి తేబడిన యాజకులలో ఒకనిని అచ్చటికి మీరు తోడుకొని పోవుడి; అతడు అచ్చటికి పోయి కాపురముండి ఆదేశపు దేవుని మర్యాదను వారికి నేర్పవలెనని ఆజ్ఞాపించెను. కాగా షోమ్రోను (సమరయ) నుండి వారు పట్టుకొని వచ్చిన యాజకుడు వచ్చి బేతేలు ఊరిలో కాపురముండి యెహోవా యందు భయభక్తులుగా ఉండ తగిన మర్యాదను వారికి బోధించెను." 2 రాజులు 17:22-28.

ఇశ్రాయేలు, అష్షూరీయుల మిశ్రమ సంతానమే సమరయులు. యోహాను 4వ అధ్యాయములో, క్రీస్తుతో సంభాషించిన సమరయ స్త్రీ ఆయనతో – "క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును. ఆయన వచ్చినప్పుడు మాకు సమస్తమును తెలియజేయును" (4:25) యని అంది.

దీన్ని బట్టి మిశ్రమ జాతియైన సమరయులు సహితం మెస్సీయ కొరకు నిరీక్షించినట్లు స్పష్టమగుతోంది.

## మెస్సీయ కొరకు యూదుల నిరీక్షణ

నెబుకద్నేజరుచే బబులోను చెరకు కొనిపోబడక ముందు యిర్మీయా వారి గతిని గూర్చి యిట్లు ప్రవచించాడు : "యెహోవా ఈ ఆజ్ఞ యిచ్చు చున్నాడు. బబులోను రాజ్యముకు డెబ్బది సంవత్సరములు గతించిన తర్వాతనే మిమ్మును గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి, ఈ స్థలమునకు తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును"(యిర్మీయా 29:10). ఈ ప్రవచన ప్రకారం యూదావారు బబులోనులో 70 సం॥లు జీవించారు (దానియేలు 9:2; 2దిన 36:26).

యిర్మీయా ప్రవచనము నెరవేరునట్లు పారశీక రాజైన కోరెషు మనస్సును యెహోవా ప్రేరేపించగా, యెరూషలేములో దేవుని మందిరాన్ని తిరిగి నిర్మించుటకు అనుమతించాడు (ఎజ్రా 1). క్రీ.పూ. 536 సం॥లో జెరుబ్బాబెలు నాయకత్వాన బయలుదేరి యెరూషలేమునకు తిరిగి వచ్చిన యూదులు 20 సం॥లలో యెరూషలేము దేవాలయాన్ని పునఃనిర్మించారు (ఎజ్రా 3-6). క్రీ.పూ. 457 సం॥లో ఎజ్రా నాయకత్వమున మరి కొందరుయూదులు యెరూషలేము చేరుకున్నారు. శాస్త్రియైన ఎజ్రా ధర్మశాస్త్రాన్ని పరిశోధించి దేవాలయ మందలి యాజక ధర్మములను విధులను పునరుద్ధ రించాడు (ఎజ్రా 7-10). పిమ్మట క్రీ.పూ. 444 సం॥లో బబులోను నుండి నెహెమ్యా యెరూషలేము వెళ్ళి ప్రాకారాలను తిరిగి కట్టించాడు.

అప్పటి నుండి యూదుల తమ దేవుణ్ణి ఆరాధించుకోవటానికి యెరూషలేములో దేవాలయాన్ని కలిగియుండిరి. "యెరూషలేములో సుమెయోనను ఒక మనుష్యుడుండెను. అతడు నీతిమంతుడును, భక్తి పరుడునై యుండి ఇశ్రాయేలు యొక్క ఆదరణ కొరకు కనిపెట్టు చుండువాడు..........." (లూకా 2:25). "యెరూషలేములో విమోచన కొరకు కనిపెట్టుచున్న వారందరితో ఆయనను గూర్చి మాట్లాడు చుండెను" (లూకా 2:38). "ప్రజలు కనిపెట్టుచు, ఇతడు క్రీస్తయి ఉండునేమో యని అందరును యోహాను గూర్చి తమ హృదయములలో ఆలోచించు కొను చుండిరి" (లూకా 3:15). ఈ వాక్యాల్ని బట్టి యూదులు కూడ మెస్సీయ కొరకు నిరీక్షించినట్లు తెలుస్తోంది.

ఇంతవరకు గమనించిన యూదుల

చరిత్రనుండి మనం నేర్చు కోవల్సిన విషయాలు ఏమంటే 1) సౌలు రాజుచే క్రీ.పూ. 1095 నుండి ఆరంభమైన రాజరిక పాలన క్రీ.పూ. 586లో అంతమైంది. 2) క్రీ.పూ. 586 నుండి యూదా రాజ్య సింహాసనముపై రాజు లేకపోవుట 3) యూదులు బబులోను నుండి యెరూషలేముకు తిరిగి వచ్చి దేవాలయాన్ని మరల నిర్మించుకొన్న ఆధ్యాత్మిక పరమైన పునరుద్ధరణ జరిగింది. గాని రాజకీయంగా పునరుద్ధరింపబడలేదు. అంటే లౌకిక యూదా రాజ్యపాలన యెన్నడును తిరిగి స్థాపించబడలేదు. 4) ప్రపంచములో నేడు యూదులనే వారున్నా వారు ఏయే గోత్రాలకు చెందినవారో వారికే తెలియదు. 5) గనుక యూదులకు లౌకిక రాజ్యం స్థాపించబడి యూదా గోత్రికుడు , భౌతికముగా రాజై ఏలుట ఎన్నటికి అసంభవం.

## దావీదు సంతానం - క్రీస్తు

రాజ్యాన్ని గూర్చి - రాజును గూర్చి ప్రవక్తల ద్వారా ఇశ్రాయేలీయులకు చేయబడిన వాగ్దానాలు నాటి నెరవేర్పులను తెల్సికొందాం :

1) దావీదుకు దేవుడు చేసిన వాగ్దానం : "నీ మట్టుకు నీ సంతాన మును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును; నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును" (2సమూ 7:16). పేతురు ఈ ప్రవచనాన్ని క్రీస్తుకు అన్వయించాడు. "అతడు ప్రవక్తయై యుండెను గనుక అతని గర్భ ఫలములలో నుండి అతని సింహాసనము మీద ఒకని కూర్చుండ బెట్టుదును అని దేవుడు తనతో ప్రమాణ పూర్వకముగా ఒట్టుపెట్టుకొనిన సంగతి అతడెరిగి, క్రీస్తు పాతాళములో విడువబడలేదనియు, అతని శరీరము కుళ్ళిపోలేదనియు దావీదు ముందుగా తెలిసికొని ఆయన పునరుత్థానమును గూర్చి చెప్పెను. మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశ మంతయు రూఢిగా తెలిసికొనవలెను" (అపొ. 2:30,31,36).

2) "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను. ఆయన భుజము మీద రాజ్య భారముండును. ఆశ్చర్యకరుడు, ఆలోచన కర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతియని అతనికి పేరుపెట్టబడును. ఇది మొదలు మితిలేకుండా దానికి వృద్ధియు, క్షేమము కల్గునట్లు సర్వకాలము దావీదు సింహా

సనమును రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపాలన చేయును. సైన్యములకు అధిపతి యగు యెహోవా ఆసక్తి కలిగి దీనిని నెర వేర్చును" (యెషయా 9:6,7). నెరవేర్పు : "ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు. ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును. ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసన మును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని ఆమెతో చెప్పెను" (లూకా 1:31-33).

3) "నేను దావీదు యింటి తాళపు అధికార భారమును అతని భుజము మీద ఉంచెదను. అతడు తీయగా ఎవడును మూయ జాలడు. అతడు మూయగా ఎవడును తీయజాలడు" (యెషయా 22:22). నెరవేర్పు: "దావీదు తాళపు చెవి కలిగి, ఎవడును వేయలేకుండా తీయు వాడును, ఎవడును తీయకుండ మూయు వాడునైన సత్యస్వరూపి యగు పరిశు ద్ధుడు......" (ప్రకటన 3:7). ఈయన క్రీస్తే యని మనకు స్పష్టమే.

4) యెష్షయి మొద్దు నుండి చిగురు పుట్టును. దాని వేరుల నుండి అంకురము ఎదిగి ఫలించును" (యెషయా 11:1). ఈయన యేసే యని పౌలు చెబుతున్నాడు : "యెష్షయిలో నుండి వేరు చిగురు, అనగా అన్యజనులు నేలువాడు వచ్చును; ఆయన యందు అన్యజనులు నిరీక్షణ యుంచు దురు" (రోమా 15:12).

పై ప్రవచనము నెరవేర్పును బట్టి దావీదు సంతతి నుండి వచ్చిన క్రీస్తే రాజని విపులమగుచున్నది. క్రీస్తు తన రాజ్యాన్ని స్థాపించలేక సంఘాన్ని స్థాపించాడు యని బోధించటం దేవుని యొక్క సంక ల్పాన్ని ఆయన సర్వశక్తిని తృణీకరించడమే. దేవునికి అసాధ్యమైన దేదియు లేదు. క్రీస్తు రాజయితే ఆయన రాజ్యమేది? దాని స్వాభా వికత ఎట్టిది? అది ఎప్పుడు స్థాపించ బడింది?

*(మిగతా వచ్చే సంచికలో)* — పి.వి. సత్యవతి

# ఇది నీకు తెలుసా?

నీకు తెలుసో లేదో గాని పేదవానిగా నుండుట చాల మంచిది. నీవు ఐశ్వర్యవంతుడవా? కొన్నిటిలో నీవు ధనవంతుడవు కావచ్చును. నీవు పుష్టిగా శరీరారోగ్యము గలిగియుండినను అనేక మందిచే గౌరవింప బడుచుండినను నీవు ధనవంతుడవని చెప్పవచ్చును. నివసించుటకు చక్కటి యిల్లు, తినుటకు కావలసినంత ఆహారము సమృద్ధిగా వుండిననూ నిన్ను ధనవంతుడనే పిలువ వచ్చును.

అధిక ధనము కలిగియుండుట లేక భాగ్యవంతునిగా యుండుట మంచిదని నీవనుకొనుచున్నావా? అట్లనుకొనుట సహజమే! అయితే అది చాల అనర్థాలకు సమస్యలకు దారితీయునని బైబిలు చెప్పచున్నది. ముఖ్యముగా మత్తయి 19:24లో "ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుట కంటె సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని" యేసు చెప్పెను. అనగా ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో కష్టమని ఒక్కోసారి అసాధ్యమని కూడ అర్థమిచ్చుచున్నది గదా! ఇదే సందేహమును శిష్యులు క్రీస్తును ఆశ్చర్యముతో అడిగినట్లు ఆ క్రింది వచనములో చదువగలము (19:25). "ఆలాగయితే ఎవడు రక్షణ పొందగలడని?...." (మత్తయి 19:25).

అయితే యేసుక్రీస్తు దానికి జవాబుగా 26వ వచనములో ఈవిధముగా చెప్పెను: "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సమస్తమును సాధ్యమని చెప్పెను". అయితే దేవునియందు విశ్వాసముతో ఆయనపై భారముంచినట్లయితే నీకు అసాధ్యమయినది ఏదీ ఉండదని అర్థమగుచున్నది. మార్కు 10:24లో యేసుక్రీస్తు యిట్లు చెప్పెను: "తమ ఆస్థియందు నమ్మకముంచువారు దేవుని రాజ్యములో ప్రవేశించుట ఎంతో దుర్లభము".

ధనవంతుడై యుండుట చాల హానికరమని, చెడ్డదని, కష్టతరమైనదని బైబిలు గ్రంథము చాల స్పష్టముగా చెప్పచున్నది. నీకు భోగభాగ్యములు లేకున్న విచారింపకుము. దేవుని యందు విశ్వాస ముంచుము, మంచి వాటిని గూర్చి యోచించి సమకూర్చుకొనుము. పరలోకమందు నీ ధనసమధికము చేసుకొనుము.

- మేరి ఏన్ డేవిస్

## గమనిక

సత్యవాక్కు చదువరులకు గమనిక. సత్యవాక్కు మాసపత్రిక మీకు ప్రతినెలా సకాలనికి అందుచున్నదనియే మా విశ్వాసము. యిది ప్రభుత్వము వారిచే గుర్తింపు పొందిన పత్రిక. గనుక మీరు మీ సాలు చందా 50/- రూ॥లు అత్యవసరముగా చెల్లించాలి. మాస పత్రిక కొరకు సాలు చందా కట్టేవారు పాత మెంబర్లయితే మీ M.O. కూపన్ మీద అడ్రసుతో పాటు సత్యవాక్కు సభ్యత్వపు నంబరును కూడా తెలియజేయండి. ఒకవేళ ఈ మాసపత్రిక ఒకటి కంటే ఎక్కువ ప్రతులు మీకు అందుచున్న యెడల వాటినంబర్లను కూడా మాకు తెలియజేయండి.

- ఎడిటర్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From:

SATYA VAKKU
P.O. Box 80,
Kakinada - 533 001

To

Edited & published by Joshua Gootam Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.